క్లుప్తంగా

క్యూరింగ్‌లో జాగ్రత్తలు పాటించాలి

కందుకూరు: పొగాకు రైతులు ప్రస్తుతం క్యూరింగ్‌లో పలు జాగ్రత్తలు పాటించడం వల్ల అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని ఒకటో వేలం కేంద్రం నిర్వహణాధికారి చైన్‌రామ్ మీనా అన్నారు. మండలంలోని పందలపాడులో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. క్యూరింగ్, గ్రేడింగ్ సమయాల్లో పొగాకులో అన్య పదార్థాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్య పదార్థాలు లేని పొగాకు మాత్రమే అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందన్నారు. క్యూరింగ్ సమయాల్లో పొగ గొట్టాలపై జల్లెలు ఏర్పాటు చేసుకోవాలని, బ్యారన్‌లో పరిమితి మేరకే కర్రలు అమర్చాలని సూచించారు. ఐటీసీ మేనేజర్ సొహైల్, పోలిశెట్టి, జీపీఐ కంపెనీల ప్రతినిధులు రామాంజనేయులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

5న ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశం

కందుకూరు రూరల్: ఏపీటీఎఫ్ నెల్లూరు జిల్లా కార్యవర్గ సమావేశం ఈ నెల 5న నెల్లూరు జీవీకే మెమోరియల్ వైద్యశాల సమీపంలో జరుగుతుందని ఏపీటీఎఫ్ కందుకూరు జోన్ ఉపాధ్యక్షుడు మునీర్‌బాషా, పూర్వ ఉపాధ్యక్షుడు సుబ్బారావు గురువారం తెలిపారు. కందుకూరు జోన్ పరిధిలోని మండల శాఖల అధ్యక్షులు, కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు హాజరుకావాలని కోరారు.

పోలింగ్‌స్టేషన్లు పరిశీలన



పోలింగ్‌స్టేషన్లు పరిశీలిస్తున్న కమిషనర్, తహసీల్దార్

కందుకూరు అర్బన్: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పట్టణంలోని పోలింగ్‌స్టేషన్లు కమిషనర్ ఎస్. మనోహర్, తహసీల్దార్ సీతారామయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలురు, బాలిక పాఠశాలోని పోలింగ్‌స్టేషన్లు పరిశీలించి వాటిలో మౌలిక వసతులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

కనిగిరి రూరల్: విద్యార్థుల మేధాశక్తి పెరిగేందుకు విజ్ఞాన పుస్తకాలు అందచేయడం అభినందనీయమని ఎంఈఓ ప్రసాద్‌రావు అన్నారు. గుడ్ హెల్ప్ సంస్థ డైరెక్టర్ మంద్రు రమేష్ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గురువారం యండమూరి వీరేంద్రనాథ్ రచించిన మొదటి ర్యాంకుకు 100 సూత్రాల పుస్తకాలను పంపిణీ చేశారు. హెచ్ఎం సంజీవీ, సామాజిక కార్యకర్త నవకుమార్, నాగార్జున, వెంకట్రావ్ పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభను జయప్రదం చేయాలి

సీఎస్‌పురం: సీఐటీయూ మండల మహాసభను జయప్రదం చేయాలని శాఖ మండల నాయకుడు బక్కా ఏసురత్నం కోరారు. మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. ఉప్పలపాడులో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఏసురత్నం, ఊసా రాజ్యలక్ష్మి, చిట్టిబాబు, దేవదానం, శ్రీను, మున్నయ్య, యోహాను, ఆనందం, నాగూర్‌బాషా, కెవిపిఎస్ రత్నం లు పాల్గొన్నారు.

రేపు ద్విచక్ర వాహనం వేలం

గుడ్లూరు: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో 4వ తేదీ శనివారం ద్విచక్ర వాహనాన్ని బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్సై ప్రసాదరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సమక్షంలో ఉదయం 10.30 హోండా గ్లామర్ ద్విచక్రవాహనాన్ని వేలంపాట నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని ఆయన కోరారు.

శనగ పంటల పరిశీలన



శనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి హేమంత్‌భరత్‌కుమార్

వలేటివారిపాలెం: మండలంలోని నేకూనాంపురం, శింగమనేనిపల్లి గ్రామాల్లోని శనగ పంటలను వ్యవసాయాధికారి హేమంత్ భరత్‌కుమార్ గురువారం పరిశీలించారు. ప్రస్తుతం శనగలో ఎండు తెగులు ఉండటంతో వాటి నివారణ చర్యల గురించి తెలిపారు. శనగకు ఆశించే పచ్చ రబ్బరు పురుగు, శనగ పచ్చ పురుగు నివారణకు కొన్ని పద్ధతులు తెలిపారు. రబీ సీజన్లో సాగు చేసిన శనగ, పొగాకు, పత్తి పంటలను ఆర్‌బీకేల్లోని నమోదు చేసుకోవాలన్నారు.

పేదరిక నిర్మూలనే సీఎం జగన్ లక్ష్యం

- వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- జెడ్.మేకపాడులో గడప గడపకు మన ప్రభుత్వం



జెడ్.మేకపాడులో బుక్‌లెట్ అందజేస్తున్న అశోక్‌బాబు

పొన్నలూరు: గ్రామాల్లో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన కొనసాగిస్తున్నారని కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని జెడ్.మేకపాడు, ఓరుగంటివారిపాలెం గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటిని సదర్శించి మూడున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదును జమ చేస్తూ గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం అబద్ధపు హామీలు ఇచ్చి రైతులు, మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, కాని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. జగనన్న కాలనీల ద్వారా ప్రజలకు సొంతింటి కలను నిజం చేస్తూ ఒకే చోట వందల కొద్ది గృహాలను నిర్మిస్తూ సరికొత్త గ్రామాలను రాష్ట్ర ప్రభుత్వం సృష్టిస్తోందన్నారు. పేద ప్రజలు, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం అశోక్‌బాబు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులను సమన్వయం చేసి వారి మధ్య ఉన్న బేధాభిప్రాయాలను తొలగించి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ కాటూరి రంగయ్య, మాజీ సర్పంచ్ కాటూరి వెంకటేశ్వర్లు, కడియాల రవణయ్య, చుండూరి ప్రసాద్, షేక్ నాయబ్ రసూల్, కడియాల శేషయ్య, బొర్రా బ్రహ్మయ్య, మందా లలితమ్మ, తాళ్లూరి బ్రహ్మయ్య, అధికారులు పాల్గొన్నారు.

గృహ సారథులు ప్రజలకు అండగా ఉండాలి

- వరికూటి అశోక్‌బాబు సూచన



పొన్నలూరులో గృహ సారథులకు అవగాహన కల్పిస్తున్న అశోక్‌బాబు

పొన్నలూరు: గ్రామాల్లో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా పనిచేస్తూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రజలకు అండగా ఉండాలని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. పొన్నలూరు, బోగనంపాడు గ్రామాల్లో గురువారం మండలంలోని 15 సచివాలయాల పరిధిలో కొత్తగా నియమితులైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు వారి విధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. గృహ సారథులు, వలంటీర్లు సమన్వయంతో పనిచేసి అర్హత కలిగిని ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేయాలన్నారు. గృహ సారథులు సేవా భావంతో మెలిగి వారి పరిధిలోని ప్రతి కుటుంబాన్ని సందర్శించి వారి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు, గ్రామాల అభివృద్ధికి చేస్తున్న మంచి పనులను, అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూ వారిని చైతన్యం చేయాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి నాడు టీడీపీ ప్రభుత్వం చేసిన పనులను, నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన పనుల మధ్య తేడాని ప్రజలకు వివరించాలన్నారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన రంజక పాలన గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జగనన్నే మన భరోసా, జగనన్నే మన నమ్మకం అనే నినాదాన్ని ప్రజలోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. సైనికులుగా పని చేసి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ విజయం సాధించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

మిద్దె పైనుంచి పడి మహిళ మృతి



మృతి చెందిన లక్ష్మీరాజ్యం

పొన్నలూరు: ప్రమాదవశాత్తు మిద్దె పైనుంచి పడి మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని ముండ్లమూరివారిపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్మి లక్ష్మీరాజ్యం(45) బుధవారం ఉదయం దుస్తులు ఉతికి వాటిని మిద్దెపైన ఆరేసింది. అయితే పనికి వెళ్లి మధ్యాహ్న సమయంలో ఇంటికి వచ్చిన లక్ష్మీరాజ్యం దుస్తులు తీసేందుకు మిద్దె పైకి ఎక్కి పిట్ట గోడ మీదకు వంగింది. ఒక్కసారిగా పిట్టగోడ కూలిపోవడంతో కింద పడిన లక్ష్మీరాజ్యం తలకు తీవ్ర గాయమైంది. దీంతో బంధువులు చికిత్స కోసం ఒంగోలు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.రాజారావు తెలిపారు.

ఆటోలపై క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు తప్పనిసరి

- సీఐ దాచేపల్లి రంగనాథ్



జరుగుమల్లిలో ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ రంగనాథ్

సింగరాయకొండ: ప్రయాణికుల భద్రత కోసం మండలంలో తిరిగే ఆటోలపై పోలీసు శాఖ ఇచ్చిన క్యూఆర్ కోడ్ నంబరు స్టిక్కర్లను తప్పనిసరిగా అతికించాలని సీఐ దాచేపల్లి రంగనాథ్ స్పష్టం చేశారు. జరుగుమల్లి పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం ఆటో డ్రైవర్లకు ప్రయాణికుల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ రంగనాథ్ మాట్లాడుతూ.. పోలీసు శాఖ ఇచ్చిన క్యూఆర్ కోడ్‌తోపాటు నంబరు ఉన్న ఆటోల్లో మాత్రమే ప్రయాణికులు ఎక్కాలని సూచించారు. ఆటో ఎక్కేటప్పుడు ముందుగా తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. అనంతరం ఆటో డ్రైవర్లకు స్టిక్కర్లు అందజేశారు. ఎస్సై వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు

ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కేసులు నమోదు చేయడంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని ఎస్సై షేక్ ఫిరోజ్ ఫాతిమా హెచ్చరించారు. స్థానిక కందుకూరు రోడ్డు సెంటర్‌లో గురువారం ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై ఫిరోజ్ ఫాతిమా మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించాలన్నారు. ప్రతి ఆటోపై క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను అతికించాలని సూచించారు. రోడ్డు మార్జిన్లలో వాహనాలు ఇష్టారీతిగా పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఏఎస్సై షేక్ మహబూబ్‌భాషా, హెడ్ కానిస్టేబుల్ రమేష్ పాల్గొన్నారు.

ఆక్వా జోన్లతో రైతులకు లబ్ధి

సింగరాయకొండ: ఆక్వా జోన్ల ఏర్పాటుతో ఆక్వా రైతులకు ప్రభుత్వం నుంచి అన్ని రకాల సబ్సిడీలు దక్కుతాయని మండల మత్స్యశాఖాధికారి ఎస్‌వీఎస్ వర్షిణి పేర్కొన్నారు. మండలంలోని పాతసింగరాయకొండ గ్రామ సచివాలయంలో గురువారం ఆక్వా చెరువులను ఆక్వా జోన్ కింద ప్రకటించేందుకు అభ్యంతరాల స్వీకరణపై గ్రామ సభ నిర్వహించారు. మత్స్యశాఖాధికారి మాట్లాడుతూ.. పంచాయతీ పరిధిలో ప్రస్తుతం 30 ఎకరాల వరకు ఆక్వా జోన్ పరిధిలో ఉండగా ఇప్పుడు అదనంగా మరో 49 ఎకరాలను జోన్ పరిధిలో చేర్చినట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలో సుమారు 246 ఎకరాల భూమిలో ఆక్వా సాగవుతోందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 10 ఎకరాల లోపు చెరువులు సాగు చేస్తున్న రైతులకు విద్యుత్ సబ్సిడీ పోను యూనిట్‌కు 1.50 రూపాయలు మాత్రమే వసూలు చేయడం జరుగుతుందన్నారు. ఆక్వా జోన్ పరిధిలో చెరువులకు సీడ్, ఫీడ్‌పై ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు లభిస్తాయని వివరించారు. గ్రామ సర్పంచ్ వల్లూరి రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు, సచివాలయ మత్స్యశాఖ అసిస్టెంట్ ప్రదీప్, తిరుపతయ్య, అగ్రికల్చర్ అసిస్టెంట్ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు త్వరలోనే పరిష్కారం



సైడు కాలువలకు భూమి పూజ చేస్తున్న వరికూటి అశోక్‌బాబు

టంగుటూరు: టంగుటూరు పంచాయతీ పరిధిలోని రావివారిపాలెంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణంతో తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. టంగుటూరు పంచాయతీ పరిధిలోని రావివారిపాలెంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి స్థల పరిశీలన చేసి, సైడు కాలువలకు గురువారం భూమి పూజ చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామ ప్రజలు నీటి సమస్య తెలియజేయగా.. అశోక్‌బాబు అధికారుల దృష్టికి తీసుకెళ్లి జలజీవన్ మిషన్ పథకం కింద 50 వేల లీటర్ల నీటిని నిల్వ చేసే ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించేందుకు రూ.30 లక్షలు మంజూరు చేయించారు. అనంతరం స్థల పరిశీలన చేసి, వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రత్యేక నిధులు రూ.5 లక్షలతో సైడు కాలువల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ నరసింహారావు, ఏఈఈ సుబ్బారావు, ఈఓఆర్డీ నర్రా జగదీష్‌బాబు, బీసీడి ఉదయకుమార్, రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, మక్కెన వెంకయ్య, వైఎస్సార్ ఉపాధ్యాయ విభాగం అధ్యక్షుడు సూదనగుంట వెంకటస్వామి, వార్డు మెంబర్లు నంబూరి అశోక్, బత్తుల ఆనంద్, బత్తుల వెంకటేశ్వర్లు, మాధవరావు, బాబురావు, సవలం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక కేంద్రాలు

సింగరాయకొండ: విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ప్రభుత్వం శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని ఎంపీడీఓ షేక్ జమీఉల్లా పేర్కొన్నారు. విద్యార్థులు ప్రాథమిక దశలో తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి నియోజకవర్గ కేంద్రంలోను, ఉన్నత విద్య చదివిన విద్యార్థుల కోసం జిల్లా కేంద్రంలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. నియోజకవర్గ స్థాయిలో కొండపిలో, జిల్లా స్థాయిలో ఒంగోలులోని మంగమ్మ కాలేజీలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ఈ కేంద్రాల్లో సాంకేతిక శిక్షణ, భాషా, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ, వ్యాపార నిర్వహణపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ కేంద్రాల్లో వసతితోపాటు ఉచిత భోజన సదుపాయం కూడా ఉంటుందన్నారు. విద్యార్థులు రెండు లేదా మూడు రోజుల్లో వలంటీర్ల వద్ద యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

ఘనంగా జిల్లా అవతరణ దినోత్సవం



టంగుటూరి ప్రకాశం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



కందుకూరులో ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

కనిగిరి రూరల్: జిల్లా అవతరణ దినోత్సవ వేడుకలను గురువారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ భవనలో టంగుటూరి ప్రకాశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో టంగుటూరి ప్రకాశం పంతులు కృషిని కొనియాడారు. రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు రాష్ట్రానికి ఎనలేని సేవలు అందించారన్నారు. వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాణిక్యరావు, కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు వేల్పుల వెంకటేశ్వర్లు, దేవరాజ్, తిరుపతయ్య, జానీ, మీరావలి, అబ్రహం లింకన్, నక్కా రామకృష్ణా, పెన్నా ఏడుకొండలు, దాసరి మురళీ, శ్రీహరిరెడ్డి, కంటు గురవయ్య, మున్నా, మన్సూర్, నాగూర్‌బీ, భారతీ, శిగా కృష్ణారావు ఖాదర్‌వలి, నారాయణరెడ్డి, యోగిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

కందుకూరు అర్బన్: ప్రకాశం జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక కోవూరు రోడ్డులోని ప్రకాశం పంతులు విగ్రహానికి ఆంధ్రకేసరి సేవా సమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళిలర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రకేసరి సేవా సమితి అధ్యక్షులు మంచిరాజు మురళి మాట్లాడుతూ టంగుటూరు ప్రకాశం పంతులు పేరును ప్రకాశం జిల్లాకు పెట్టడం ఉమ్మడి ప్రకాశం జిల్లా వాసులుగా మనందరికీ సంతోషదాయకమన్నారు. డాక్టర్ తన్నీరు మల్లికార్జున మాట్లాడుతూ మహనీయులను గౌరవించుకోవడం మన అదృష్టమన్నారు. కార్యక్రమంలో ఆంధ్రకేసరి సేవా సమితి ప్రధాన కార్యదర్శి విప్పుగుంట సుబ్బారావు, మాధవరావు, గణపతిరాజు, శేషగిరి, కాకర్ల రాజగోపాల్, శేషగిరి, శర్మ, హైకోర్టు న్యాయవాది జగదీష్, శ్రీనిధి పాల్గొన్నారు.

కేపీఎల్-2 విజేత చాంప్ లెవన్స్



విజేతగా నిలిచిన చాంప్ లెవన్స్ జట్టు

కందుకూరు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న కందుకూరు ప్రీమియర్ లీగ్-2 టీ20 క్రికెట్ పోటీల విజేతగా చాంప్ లెవన్స్ జట్టు విజేతగా నిలిచింది. పది రోజులుగా కేపీఎల్-2 పోటీలు అట్టహాసంగా జరుగుతున్నాయి. మొత్తం 26 జట్లు పోటీల్లో పాల్గొనగా చాంప్ లెవన్స్, సంతోష్‌నగర్ డైనమిక్స్ జట్లు ఫైనల్‌కు చేరాయి. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన చాంప్ లెవన్స్ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 150 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేసిన సంతోష్‌నగర్ జట్టు 100 పరుగులకే పరిమితమైంది. దీంతో చాంప్ లెవన్స్ జట్టు విజేతగా నిలిచి సురేష్‌రెడ్డి చికెన్ సెంటర్ అధినేత సురేష్‌రెడ్డి చేతుల మీదుగా టోర్నమెంట్ మొదటి బహుమతి రూ.50వేలు కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో నిలిచిన సంతోష్‌నగర్ జట్టుకు రూ.30 వేలు బహుమతిని కళ్యాణి శిల్క్స్ అధినేత వినోద్ అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా చాంప్ లెవన్ జట్టుకు చెందిన జయసూర్య, బెస్టు బౌలర్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బహుమతులను సంతోష్‌నగర్ జట్టుకు చెందిన సల్మాన్ అందుకున్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు సీనియర్ క్రికెట్ ప్లేయర్ కొంగల నాగరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ రఫి, డాక్టర్ నవీన్‌కుమార్, విఠల్ ట్రేడర్స్ అధినేత విఠల్‌లు బహుమతులు అందజేశారు.

డిప్యూటీ సీఎంను కలిసిన చైర్మన్ గఫార్



వినతిపత్రం అందచేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: కనిగిరి పట్టణంలో షాదీఖానా అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ డిప్యూటీ సీఎం ఎస్‌కే అంజాద్‌బాషా, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందచేశారు. తాడేపల్లిలో గురువారం జరిగిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీల సమావేశంలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషాను, సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసినట్లు విలేకర్లకు తెలిపారు. పట్టణంలో ముస్లిం ప్రజలకు మరొక షాదీఖానా అవసరమని, అందుకు రూ.3 కోట్లు నిధులు ఇవ్వాలని, ఇందిరాకాలనీ, బీసీ కాలనీ, ఎన్జీవో కాలనీ, శివనగర్ కాలనీ, రాజీవ్ కాలనీ, అర్బన్ కాలనీ తదితర ముస్లింలు అధికంగా ఉన్నా శ్మశానవాటిక నిర్మాణాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని విన్నవించినట్లు చెప్పారు. అనంతరం డిప్యూటీ సీఎంను చైర్మన్‌తో పాటు డాక్టర్ రసూల్, హాఫీజ్ ఇర్ఫాన్ తదితరులు సన్మానించారు.

ఉమ్మడి వనరుల పునరుద్ధరణతో పచ్చదనం

టంగుటూరు: ఉమ్మడి వనరుల పునరుద్ధరణ, జీవ వైవిధ్య పరిరక్షణతో పర్యావరణాన్ని పచ్చదనంగా మార్చుకోవడం మంచి పరిణామమని ఎంపీడీఓ అజిత పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సిరి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఐటీసీ బంగారు భవిష్యత్ సహకారంతో ఉమ్మడి వనరుల పునరుద్ధరణ జీవ వైవిధ్య పరిరక్షణ అనే కార్యక్రమం గురువారం నిర్వహించారు. సంస్థ మేనేజర్ శాస్త్రి మాట్లాడుతూ.. ఐటీసీ సహకారంతో జిల్లాలో 75 వేల ఎకరాల్లో ఉమ్మడి వనరులు అభివృద్ధి చేయడం తమ లక్ష్యమని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ, ఏపీఓ సుభాషిణి, సంస్థ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ వి.ఉదయభాస్కర్, సెర్ప్ కోఆర్డినేటర్ ధనుంజయ, ఆర్గనైజర్లు మనోహర్, కోటి రవికుమార్, మస్తాన్ వలి, సుబ్బారావు, సర్పంచులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వివేక విద్యార్థుల ప్రతిభ

కందుకూరు రూరల్: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో కందుకూరు వివేక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపల్ అబ్బూరి వెంకటేశ్వర్లు తెలిపారు. అండర్ 21 విభాగంలో నెల్లూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన పి.మానస, టి.మానస మంచి ప్రతిభ చూపడంతో జిల్లా జట్టు రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. వీరిని ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల అధినేత ఉన్నంభాస్కరరావు, బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బాల భాస్కరరావు, నరేంద్రబాబు అభినందించారు.

మెకానిక్‌కి ఆర్థిక సాయం

కందుకూరు: ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందిన బైక్ మెకానిక్ కుటుంబాన్ని ఆదుకునేందుకు కందుకూరు బైక్ మెకానిక్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. స్థానిక ఆదిత్య ఫంక్షన్‌హాల్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో నగదు అందజేశారు. పట్టణానికి చెందిన మెకానిక్ ఖాదర్ గుండె సంబంధిత అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. చికిత్స కోసం భారీగా నగదు అవసరం కావడంతో ముందుకు వచ్చిన తోటి మెకానిక్‌లు సంఘం తరుపున సాయం అందించారు. సంఘం రాష్ట్ర నాయకుల చేతుల మీదుగా ఖాదర్‌కు రూ.3.70 లక్షల సాయం చేశారు. అలాగే అనారోగ్యంతో మరో ఇద్దరు మెకానిక్‌లకు రూ.10వేల చొప్పున సాయం అందజేశారు. సంఘం నాయకులు జిలాని, ఖుద్దీష్, రూబీ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



చిరుధాన్యాల గురించి వివరిస్తున్న శివన్నారాయణ

గుడ్లూరు: పోషక విలువలు ఉన్న చిరుధాన్యాలను ప్రతి రోజూ తీసుకుంటే ఆరోగ్యకరంగా ఉంటారని నెల్లూరు ఆత్మ డీపీడీ జి.శివన్నారాయణ అన్నారు. మండలంలోని దారకానిపాడు రైతు భరోసా కేంద్రంలో చిరు ధాన్యాల సాగు ప్రాముఖ్యతపై గురువారం మహిళలకు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పూర్వీకులు చిరుధాన్యాలను వాడి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ వ్యాధుల బారిన పడకుండా జీవనాన్ని కొనసాగించారని గుర్తు చేశారు. నేటి జీవన విధానంలో చిరుధాన్యాలను వాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ సురేఖాదేవి మాట్లాడుతూ పత్తి పంటలో జిగురు అట్టలు వాడటం వల్ల తెల్ల దోమ, తామర పురుగులను సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. పత్తిని పరిశీలించి జిగురు అట్టలు వాడే విధానం గురించి వివరించారు. నెల్లూరు డీఆర్సీ ఏడీఏ మారుతీదేవి, ఏడీఏ శేషగిరిరావు, సర్పంచ్ చిత్తారి చెంచమ్మ, ఏఓ రవికుమార్, వీఏఏలు పాల్గొన్నారు.

8 మద్యం బాటిళ్లు సీజ్

టంగుటూరు: మండలంలోని అనంతవరం గ్రామంలో కసుకుర్తి అంజయ్య నివాసంలో 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్సై చెప్పారు.

సిబ్బందికి సమయపాలన తప్పనిసరి

లింగసముద్రం: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రసేన్ అన్నారు. మండలంలోని అన్నెబోయినపల్లె సచివాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది హాజరు, బయోమెట్రిక్‌ను పరిశీలించారు. సచివాలయ పరిధిలోని అన్నెబోయినపల్లె, అంగిరేకులపాడు గ్రామాల్లో ఇంటిపన్ను తక్కువగా వసూలు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటిపన్ను వందశాతం వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అర్జీలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. మండలంలో 92 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ చెప్పారు.

న్యాయం చేయాలని ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న డీజీపేట గ్రామస్తులు

సీఎస్‌పురం: మా భూములు మాకు ఇప్పించండి అంటూ మండలంలోని డీజీపేటకు చెందిన పలువురు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మండలంలోని డీజీపేటకు చెందిన షేక్ పెదనమీ సాహెబ్, నాగూర్‌వలి, కరీముల్లా వారి కుటుంబసభ్యులతో కలిసి గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. డీజీపేట రెవెన్యూలో 56, 58 సర్వే నంబర్లలో తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమున్నాయనీ, ఆ భూములను 2019 అప్పటి తహసీల్దార్ వేరే వారి పేరుతో ఆన్‌లైన్ చేశారని, తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఊసా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాపు నమోదు వివరాల పరిశీలన

సీఎస్‌పురం: ఈ క్రాపు నమోదు వివరాలను గురువారం అధికారులు పరిశీంచారు. 2022-23 రబీ సీజన్‌కు సంబంధించిన పంటలను వీఏఏ ఇ క్రాపు నమోదు చేశారు. ఇందులో బాగంగా జాయింట్ అజమాయిషీలో భాగంగా తహసీల్దార్ ఏ బాలకిషోర్, వ్యవసాయాధికారి కంచెం రాధ మండలంలోని నల్లమడుగుల, పెదరాజుపాలెం, కంభంపాడు, సి.నాగులవరం గ్రామాల పరిధిలో తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పంట పేరు తప్పుగా నమోదు చేసిన వాటిని తిరస్కరించారు. వీఆర్‌ఓలు అజయ్, సుధాకర్, శ్రీను, వీఏఏ లు పాల్గొన్నారు.